RNI No: APTEL /25/A2860

సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 80 | పేజీలు : 4 | సోమవారం 21 సెప్టెంబర్ 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



అంతరిక్షం రంగంలో
చైనా దూకుడు

45 గంటలు.. నాలుగు రాకెట్లు.. 30 ఉపగ్రహాలు..

మూడు వేర్వేరు ప్రయోగ కేంద్రాల నుంచి ప్రయోగాలు

ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి చేర్చిన నాలుగు రాకెట్లు

రెండు రాకెట్లను అభివృద్ధి చేసిన ప్రైవేటు సంస్థలు

నాలుగు ప్రయోగాల్లో జరగని రాకెట్ దశల రికవరీ

వైసీపీ నేతలది
రౌడీయిజం



- విజయవాడలో టీచర్లపై దాడి యత్నం దారుణం: మంత్రి రాంప్రసాద్ రెడ్డి
- టీచర్లపై దాడికి యత్నించడం హేయమైన చర్యగా అభివర్ణించిన మంత్రి
- విజయవాడ శాప్ కార్యాలయం వద్ద వైసీపీ నేతలు దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపణ
- జోగి రమేశ్, దేవినేని అవినాశ్ రాళ్లు, కోడిగుడ్లతో దాడి చేశారని విమర్శ
- ఇలాంటి చర్యలను సహించేది లేదన్న రాంప్రసాద్ రెడ్డి
- చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక



టీచర్లపై దాడి నిందితులను
వదిలిపెట్టం

- మంత్రి లోకేశ్ మాస్ వార్నింగ్
- స్పోర్ట్స్ కోటా టీచర్లపై దాడికి దిగారంటూ లోకేశ్ ఆగ్రహం
- దైవం వంటి గురువులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలుంటాయి
- దేశానికి వన్నె తెచ్చిన క్రీడాకారులను జగన్ అవమానిస్తున్నారని ఆరోపణ
- రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని విమర్శ
- ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి రావొద్దని హితవు

రాష్ట్రవ్యాప్తంగా చెరువుల
ఆధునికీకరణ



- మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన పవన్ కల్యాణ్
- పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన
- ఫకృద్దీన్ పాలెంలో సుందరీకరించిన చెరువు ప్రారంభం
- పిఠాపురంలో రూ. 6 కోట్లతో 11 చెరువుల ఆధునీకరణ
- గ్రామాల్లో చెరువులను ఆహ్లాద, ఆరోగ్య కేంద్రాలుగా మార్చే ప్రణాళిక
- రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల అభివృద్ధి

అమరావతి

ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ సోమవారం సొంత నియోజకవర్గంలో పర్యటించారు. ఫకృద్దీన్ పాలెం గ్రామంలోని మైసమ్మ చెరువు గట్టుపై వెలసిన మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, గ్రామీణ చెరువులకు సరికొత్త రూపునిచ్చే బృహత్తర కార్యక్రమంలో భాగంగా రూ. 73 లక్షల వ్యయంతో సుందరీకరించిన మైసమ్మ చెరువును ప్రజలకు అంకితం చేశారు. గ్రామాల్లోని చెరువులను కేవలం నీటి వనరులుగా కాకుండా, ప్రజలందరికీ ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచే సామాజిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ తెలిపారు. ఫకృద్దీన్ పాలెంలోని మైసమ్మ చెరువును రాష్ట్రానికే ఒక మోడల్‌గా అభివృద్ధి చేసినట్లు వివరించారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, పిల్లల పార్కును ఆయన ప్రారంభించారు. చెరువు గట్టుపై కలియదిరుగుతూ, అక్కడి వృక్షాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. - మిగతా 3లో



శబరిమల బోర్డుపై కేరళ మంత్రి సీరియస్

- హైకోర్టుకు వెళతానని హెచ్చరిక
- శబరిమలలో ప్రసాదం కొరతపై తీవ్ర వివాదం
- దేవస్వం బోర్డుపై కేరళ మంత్రి మురళీధరన్ ఆగ్రహం
- అవసరమైతే హైకోర్టుకు వెళతానని చ్చరిక
- భక్తుల రద్దీ పెరగడంతోనే కొరత ఏర్పడిందన్న బోర్డు
- విచారణ కమిటీ ఏర్పాటుపై సీఎంతో చర్చిస్తానన్న మంత్రి

ఇందిరమ్మ ఇళ్లు దక్కని వారికి
లక్కీ ఛాన్స్



- స్థానికుల కోసం మరోసారి లాటరీ!
- హైదరాబాద్ ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న స్థానికులకు శుభవార్త!
- ఇబ్రహీంపట్నం, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో స్థానికుల సంఖ్య తక్కువగా ఉన్నందున, మిగిలిన ఇళ్ల కోసం మరోసారి లాటరీ నిర్వహించే అవకాశం
- ఎంపిక కాని వారికి రూ.10,000 రిఫండ్, దరఖాస్తు తప్పులు సరిదిద్దుకోవడానికి ఈ నెల 25 వరకు గడువు

హైదరాబాద్

హైదరాబాద్ మహానగరంలోని పలు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే ఒక్కో నియోజకవర్గానికి 600 మంది చొప్పున 480 మంది ప్రధాన జాబితా, 120 మంది వెయిటింగ్ లిస్ట్‌లో ఎంపికయ్యారు. వీరి వివరాలపై అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఇబ్రహీంపట్నం, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో స్థానికుల సంఖ్య ఇళ్ల కేటాయింపునకు సరిపడా లేదని అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. దీంతో అక్కడ మిగిలిన ఇళ్ల కోసం స్థానికులుగా నిర్ధారణైన దరఖాస్తుదారులతో మరోసారి లాటరీ నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నారు. కూకట్‌పల్లిలోనూ ఇతర - మిగతా 3లో



దానం నాగేందర్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు

- పార్టీ ఫిరాయింపుల కేసులో దానంను అనర్హుడిగా ప్రకటించిన హైకోర్టు
- హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసిన దానం
- దానం పిటిషన్ ను బుధవారం విచారించనున్న సుప్రీంకోర్టు

'సర్' ప్రక్రియ పేరుతో వికృత చేష్టలకు పాల్పడుతున్నారు



- సర్ పేరుతో వికృత చేష్టలకు పాల్పడుతున్నారన్న నారాయణ
- అద్వానీ, జైశంకర్ వంటి ప్రముఖులకు కూడా నోటీసులు జారీ చేశారని విమర్శ
- వివాహానంతరం మహిళల ఇంటిపేర్లు మారడాన్ని కూడా పెద్ద సమస్యగా చూపుతున్నారని మండిపాటు



కేసీఆర్ చారిత్రక నిర్లక్ష్యంతోనే
నీటి ఎద్దడి

- కేసీఆర్ హయాంలో ఆంధ్ర ప్రాజెక్టులకు మేలు చేశారన్న జూపల్లి
- వైఎస్సార్ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపాటు
- జూరాల వద్ద రిజర్వాయర్ నిర్మించకపోవడం వల్ల 5.50 లక్షల ఎకరాలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన



బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు హైకోర్టు నోటీసులు

అసెంబ్లీ స్పీకర్ ను దూషించిన కేసు

అరెస్టు చేయవద్దంటూ నాంపల్లి కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టులో సవాల్ చేసిన పోలీసులు

కౌంటర్ దాఖలు చేయాలంటూ మధు, నవీన్ రెడ్డిలకు హైకోర్టు నోటీసులు

సోమవారం 21 సెప్టెంబర్ 2026

సీమ వార్త

సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

ప్రజాసేవలో నిర్లక్ష్యం వద్దు..!!

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

అందిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



ఐక్యత చాటితే... రిపీట్ రిజల్ట్..!!

స్థానిక ఎన్నికలకు సమరసన్నద్ధం.. కార్యకర్తల ఐక్యతతో వైయస్ఆర్ సీపీ విజయమే లక్ష్యం

పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన.... మాజీ మంత్రి పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్‌లి

మావటూరులో వైయస్ఆర్ సీపీ ఐడి కార్డుల పంపిణీ.. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం.





పెనుగొండ సెప్టెంబర్ 21 సీమ వార్త సాయంత్రం.



పెనుకొండ మండలం మావటూరు పంచాయితీలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఐడి కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు, శ్రీ సత్యసాయి జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ పాల్గొని పార్టీ శ్రేణులకు ఐడి కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ గారు మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా సన్నద్ధమై, ఐక్యతతో పనిచేసి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని అండగా నిలవాలని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, పరస్పర సహకారంతో క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైయస్ఆర్ సీపీ నాయకులు, మండల కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిడితే తిట్టాడు గాని.... ఆపదలో ఆదుకున్నాడు!"

....ముచ్చుకోట వద్ద ఆటో బోల్తా..

.....సొంత వాహనంలో బాధితులను ఆసుపత్రికి తరలించిన జేసీ ప్రభాకర్ రెడ్డి







తాడిపత్రి , సెప్టెంబర్ 21 సాయంత్రం:

నిత్యం రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ నిబంధనలు పాటించండి, హెల్మెట్ పెట్టుకోండి, ఇన్సూరెన్స్ చేయించుకోండి అంటూ ప్రజలకు క్లాస్ తీసుకుంటూ కఠినంగా కనిపించే మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ఆపద సమయంలో తనలోని మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. ఈ రోజు అనంతపురంలో జరుగుతున్న ధర్నా కార్యక్రమానికి బయలుదేరిన జేసీ ప్రభాకర్ రెడ్డి తాడిపత్రి మండలం ముచ్చుకోట గ్రామ సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనను గమనించి తన కాన్వాయ్ ని వెంటనే ఆపేశారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారు తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడి ఉండటాన్ని చూసి చలించిపోయారు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తన సొంత వాహనంలోనే క్షతగాత్రులను ఎక్కించుకుని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మార్గమధ్యలోనే తాడిపత్రి ప్రభుత్వ వైద్యులకు ఫోన్ చేసి ప్రమాద విషయాన్ని తెలిపి అత్యవసర వైద్యం కోసం సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆసుపత్రికి చేరుకున్న తర్వాత కూడా బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వైద్యులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీసి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.దీంతో అక్కడ ఉన్న స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు "తిడితే తిట్టాడు కానీ మహానుభావుడు ఆపదలో ఆదుకున్నాడు" అంటూ జేసీ ప్రభాకర్ రెడ్డి మానవతా దృక్పథాన్ని కొనియాడారు.

సంక్షేమం డోర్ టు డోర్!

.....ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: మంత్రి సవిత.

.....పెనుకొండ మున్సిపాలిటీ అభివృద్ధి జోరు.. రూ.20 కోట్ల పనులకు శ్రీకారంలి


.....తిమ్మాపురం, వెంకటరెడ్డిపల్లిలో రూ.2 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు

....అర్హులందరికీ సంక్షేమ పథకాలు. సుమారు 150 మందికి ఇంటి పత్రాల పంపిణీ చేసిన మంత్రి సవిత

పెనుకొండ సెప్టెంబర్ 21 సీమ వార్త సాయంత్రం.

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేదా అనే విషయాన్ని తెలుసుకునేందుకు రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత పెనుకొండ మున్సిపాలిటీలోని తిమ్మాపురం వెంకటరెడ్డి పల్లి గ్రామాల్లో డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్న మంత్రి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రజలకు ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా పెనుకొండ మున్సిపాలిటీలో ఇప్పటికే మంజూరైన సుమారు రూ.20 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. అలాగే తిమ్మాపురం, - మిగతా3లో







సీమ వార్త సాయంకాలం
సోమవారం 21 సెప్టెంబర్ 2026

పుట్టపర్తిలో... 18 రాష్ట్రాల సభ్యులతో సదస్సు భేష్.





16వ జాతీయ వినియోగదారుల సదస్సు

విజయవంతంపై కమిషనర్ కు కన్నబాబు ప్రశంసలు

పుట్టపర్తి డెస్క్ (విజయవాడ), సెప్టెంబర్ 21 సీమ వార్త సాయంత్రం. సత్యసాయి జిల్లా పుట్టపర్తి కేంద్రంగా నిర్వహించిన 16వ జాతీయ వినియోగదారుల సదస్సు విజయవంతంగా నిర్వహించడంపై ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లైస్ అండ్ కన్స్యూమర్ అఫైర్స్ కమిషనర్ శ్రీ కే. కన్నబాబు, రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ జి సురేష్ కుమార్ ను అభినందించారు. సోమవారం విజయవాడలోని సివిల్ సప్లైస్ రాష్ట్ర కార్యాలయంలో సురేష్ కుమార్, శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన వినియోగదారుల సంఘాల ప్రతినిధులతో కలిసి కమిషనర్ శ్రీ కే. కన్నబాబు, ఐఏఎస్‌ను, అలాగే సివిల్ సప్లైస్ డైరెక్టర్ శ్రీవాస్ నూపూర్ అజయ్ కుమార్ ని కలిసి సదస్సు విజయవంతానికి అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపి మెమెంటోను అందజేశారు.ఈ సందర్భంగా కమిషనర్ శ్రీ కే. కన్నబాబు మాట్లాడుతూ, వినియోగదారుల హక్కులు, ఆహార భద్రత, నాణ్యత ప్రమాణాలు, వినియోగదారుల అవగాహన వంటి అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు.రాష్ట్రం లోని వివిధ వినియోగదారుల సంఘాలను ఒక వేదికపైకి తీసుకువచ్చి త్వరలో ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.18 రాష్ట్రాల నుంచి వినియోగదారుల సంఘాల ప్రతినిధుల హాజరు

పుట్టపర్తి కేంద్రంగా ఈ నెల 12, 13 తేదీలలో నిర్వహించిన 16వ జాతీయ వినియోగదారుల సదస్సును కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ (జాగ్రాజా) మరియు కన్స్యూమర్ కోఆర్డినేషన్ కౌన్సిల్ (జజజ), న్యూఢిల్లీ సంయుక్తంగా నిర్వహించాయి.ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల వ్యవహారాలు, ఫుడ్ అండ్ సివిల్ సప్లైస్ శాఖతో పాటు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (సహకారంతో నిర్వహించిన ఈ జాతీయ సదస్సుకు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల నుంచి మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాలకు చెందిన వినియోగదారుల సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా ఇంత విస్తృత స్థాయిలో జాతీయ వినియోగదారుల సదస్సు నిర్వహించడం వినియోగదారుల ఉద్యమానికి ఒక ముఖ్యమైన కార్యక్రమంగా నిలిచిందని క్యాప్కో ప్రతినిధులు తెలిపారు. సదస్సు విజయవంతానికి ప్రభుత్వ శాఖలు, వినియోగదారుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు మరియు వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన ప్రతినిధులు అందించిన సహకారానికి క్యాప్కో చైర్మన్ శ్రీ సురేష్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కమిషనర్ శ్రీ కే. కన్నబాబు, ఐఏఎస్, క్యాప్కో చైర్మన్ శ్రీ సురేష్ కుమార్‌ను దుశ్శాలువతో సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎన్‌టీఆర్ జిల్లా వినియోగదారుల సంఘం ప్రతినిధి శ్రీ మాలపాక భాస్కర్, ధర్మవరం వినియోగదారుల సంఘం అధ్యక్షులు శ్రీ చిన్నతిమి చిన్నప్ప, శ్రీ సత్యసాయి జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు శ్రీ పళ్లెం జనార్ధన్, కొత్తచెరువు వినియోగదారుల సంఘం అధ్యక్షులు శ్రీ కేశవ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం డోర్ టు డోర్..!!

-మొదటిపేజీ తరువాయి

వెంకటరెడ్డిపల్లి గ్రామాల్లో సుమారు రూ.2 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను త్వరలో చేపట్టి పూర్తి చేస్తామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన గృహాలతో పాటు పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. దాదాపు 20 సంవత్సరాలుగా ఇళ్లలో నివాసం ఉంటున్న పలువురు కుటుంబాలకు అవసరమైన ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేసి సుమారు 150 మంది లబ్ధిదారులకు ఇంటి పత్రాలను మంత్రి సవిత స్వయంగా అందజేశారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన మంత్రి సవిత విద్యార్థులతో ముచ్చటించారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా, ఉపాధ్యాయులు సక్రమంగా బోధిస్తున్నారా అనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.పాఠశాల సందర్శనలో భాగంగా విద్యార్థులను తరలిస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సును మంత్రి పరిశీలించారు. డ్రైవర్ లైసెన్స్‌తో పాటు బస్సు ప్రమాణాలను పరిశీలించి, నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా డ్రైవర్లు, యాజమాన్యాలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సవిత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు..

ప్రజాసేవలో నిర్లక్ష్యం వద్దు..!!





పుట్టపర్తి,సెప్టెంబర్ ,21 సీమ వార్త సాయంత్రం. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు.సోమవారం పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను కలెక్టర్ స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిశీలించి అర్హత మేరకు పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటి ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో నేడు మొత్తం 333 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ,డిఆర్ఓ కొండయ్య,పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం..

విజయవాడలో స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లపై దాడికి వైసీపీ ముఠాలు దాడికి దిగాయంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీపై తీవ్ర ఆరోపణలు చేస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. క్రీడాకారులుగా దేశానికి పేరు తీసుకొచ్చిన వారికి అన్యాయం చేయడం సరికాదని అన్నారు. దైవంలా భావించే టీచర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు జరిగాయంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే జగన్ దుర్బుద్ధి బయటపడిందని లోకేశ్ విమర్శించారు. క్రీడల్లో ప్రతిభ చూపించి టీచర్ ఉద్యోగాలు సాధించిన వారిని వైసీపీ అవమానిస్తోందని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలంటూ స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లు విజయవాడ శాప్ కార్యాలయం వద్ద అధికారులను కలిశారని లోకేశ్ తెలిపారు. ఈ సమయంలో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు టీచర్లపై దాడికి దిగారని ఆరోపించారు. రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని లోకేశ్ ఆరోపించారు. గురువులపై రాడ్లు, కర్రలతో దాడి చేయడం దారుణమని అన్నారు. టీచర్లపై దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని లోకేశ్ స్పష్టం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలని సూచించారు.

వైసీపీ నేతలది రౌడీయిజం..

విజయవాడలోని 'శాప్' కార్యాలయం వద్ద ఉపాధ్యాయులపై దాడికి యత్నించడం హేయమైన చర్య అని ఏపీ క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. వైసీపీ నేతలు జోగి రమేశ్, దేవినేని అవినాశ్ తదితరులు గుంపులుగా వచ్చి ప్రభుత్వ కార్యాలయంపై రాళ్లు, కోడిగుడ్లతో దాడి చేయడం దారుణమని అన్నారు. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆయన, వైసీపీ నేతల తీరును తప్పుపట్టారు.

డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులపై దాడికి యత్నించడం, ప్రభుత్వ కార్యాలయాన్ని చుట్టుముట్టడం అప్రజాస్వామికమని మంత్రి విమర్శించారు. కష్టపడి ఉద్యోగాలు సంపాదించుకున్న క్రీడాకారులను, ఉపాధ్యాయులను అవమానించడం సరికాదన్నారు. సమస్యలుంటే శాంతియుతంగా పరిష్కరించుకోవాలి గానీ, ఇలా ఉద్రిక్తతలు సృష్టించడం తగదని హితవు పలికారు. ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, బాధ్యులైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవం విషయంలో వైసీపీ నేతలు ఎలా ప్రవర్తించారనేది ఆ పార్టీకే వదిలేస్తున్నామని వ్యాఖ్యానించారు. కాగా, శాప్ కార్యాలయం వద్ద మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు, వైసీపీ నేతల మధ్య నినాదాలతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు హైకోర్టు నోటీసులు

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను అసభ్య పదజాలంతో దూషించారనే ఆరోపణల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం షాక్ ఇచ్చింది. నాంపల్లి సీనియర్ సివిల్ కోర్టు ఇచ్చిన అరెస్ట్, రిమాండ్ నిరాకరణ ఉత్తర్వులను సవాలు చేస్తూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం, ఈ వ్యవహారంలో తమ సమాధానాన్ని వివరణాత్మకంగా కౌంటర్ దాఖలు చేయాలని ఇద్దరు ఎమ్మెల్సీలకు అధికారిక నోటీసులు జారీ చేసింది. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావు కోర్టు ఎదుట వాదనలు వినిపిస్తూ, రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అత్యంత అనుచిత పదజాలంతో దూషించడమే కాకుండా... విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారులపై కూడా దాడులకు తెగబడ్డారని తెలిపారు. వీరిద్దరి అరెస్టును, రిమాండ్‌ను అడ్డుకుంటూ నాంపల్లి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలని కోరారు. ఇరు వర్గాల ప్రాథమిక నివేదికలను పరిశీలించిన హైకోర్టు, తదుపరి స్పష్టత కోసం ఎమ్మెల్సీల కౌంటర్ దాఖలుకు ఆదేశిస్తూ తదుపరి విచారణను ఎల్లుండికి వాయిదా వేసింది.


కేసీఆర్ చారిత్రక నిర్లక్ష్యంతోనే నీటి ఎద్దడి

గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవగాహన రాహిత్యం, నిర్లక్ష్యపూరిత విధానాల వల్లే నేడు రాష్ట్రంలో నీటి నిల్వలు తగ్గి రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి దాపురించిందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీ ప్రాంగణంలోని మీడియా సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన... కేసీఆర్ హయాంలో కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను కేవలం 30 శాతానికే పరిమితం చేసి ఆంధ్రా ప్రాజెక్టులకు లబ్ధి చేకూర్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పోరాడి ఆ వాటాను 43 శాతానికి పెంచుకున్నామని స్పష్టం చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రారంభించిన కల్వకుర్తి, భీమా, నెట్టంపాడు ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే పాలమూరు తీవ్రంగా నష్టపోయిందన్నారు. రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసిన కేసీఆర్ పాలమూరు జిల్లాలో రిజర్వాయర్లను ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. గట్టు వద్ద 20 టీఎంసీల రిజర్వాయర్ కడతానని చెప్పిన కేసీఆర్ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. జూరాల వద్ద అదనపు రిజర్వాయర్ నిర్మించకపోవడం వల్లే ఈనాడు 5.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఈ నీటి ఎద్దడిని నివారించేందుకు 15 టీఎంసీల గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి జీవో జారీ చేయడమే కాకుండా, రికార్డు స్థాయిలో 19,543 మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూ సరఫరా వ్యవస్థను కాపాడుతోందని వెల్లడించారు. ఎల్ నినో కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం నుంచి రూ.20 వేల కోట్ల నిధులు, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురావడంలో విఫలమైన బీఆర్ఎస్, బీజేపీ నేతలు కేవలం శవాలపై పేలాలు ఏరుకునే రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

తెలుగుకే వన్నె తెచ్చిన గురజాడ సాహిత్యం.

మండల పరిషత్ కార్యాలయంలో... గురజాడ అప్పారావు 164వ జయంతి వేడుకలు.

ఎంపీడీవో కమలాబాయి ఆధ్వర్యంలో కార్యక్రమాలు.



గోరంట్ల సెప్టెంబర్ 21 సీమ వార్త సాయంత్రం. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో కమలాబాయి ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు, గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన తెలుగు సాహిత్యానికి, సామాజిక సంస్కరణలకు అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు.ఆధునిక తెలుగు సాహిత్యానికి గురజాడ దిశానిర్దేశం... గురజాడ వెంకట అప్పారావు గారు ఆధునిక తెలుగు సాహిత్యానికి దిశానిర్దేశం చేసిన నవయుగ వైతాళికుడు, మహాకవి, నాటకకర్త మరియు గొప్ప సంఘ సంస్కర్తగా ప్రసిద్ధి చెందారు.దేశం అంటే కేవలం భూభాగం కాదని, దేశ ప్రజల సంక్షేమమే దేశాభివృద్ధికి మూలమని ఆయన సందేశం ఇచ్చారు. గురజాడ 'ముత్యాల సరాలు' వంటి రచనల ద్వారా సరళమైన భాషలో సాహిత్యాన్ని ప్రజలకు చేరువ చేశారు. ఆయన రచించిన 'దిద్దుబాటు'ను తెలుగు సాహిత్యంలో తొలి ఆధునిక కథానికగా పరిగణిస్తారు. 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ', 'కన్యక', 'లవణరాజు కల', 'కొండుభట్టీయం', 'నీలగిరి పాటలు' 'సారంగధర' తదితర రచనలు ఆయన సాహిత్య ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయని గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమం లో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శబరిమల బోర్డుపై కేరళ మంత్రి సీరియస్..

ప్రఖ్యాత శబరిమల అయ్యప్ప ఆలయంలో ప్రసాదాల కొరత తీవ్ర వివాదానికి దారితీసింది. భక్తులకు అరవణ పాయసం, అప్పం తగినంతగా అందకపోవడంపై కేరళ దేవాదాయ శాఖ మంత్రి కె. మురళీధరన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు వైఫల్యం వల్లే ఈ సంక్షోభం తలెత్తిందని, ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అవసరమైతే ఈ అంశంపై హైకోర్టును ఆశ్రయిస్తానని ఆయన హెచ్చరించారు. ఆదివారం శబరిమలలో ప్రసాదాల కొరత ఏర్పడటంతో పంపిణీపై అధికారులు ఆంక్షలు విధించారు. ఒక్కో భక్తుడికి కేవలం ఒక అరవణ పాయసం టిన్, మూడు అప్పం ప్యాకెట్లు మాత్రమే అందజేశారు. మధ్యాహ్నం 1:30 గంటలకు కౌంటర్లు మూసివేసి, తిరిగి సాయంత్రం 5 గంటలకు ప్రారంభించడంతో భక్తులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు.

ఈ పరిణామాలపై దేవస్వం బోర్డు అధికారులు వివరణ ఇచ్చారు. కన్ని మాసం పూజల కోసం గత ఏడాది కంటే 50,000 అదనంగా, మొత్తం 2.6 లక్షల ప్రసాదం టిన్నులను సిద్ధం చేసినట్లు తెలిపారు. అయితే, ఈసారి ఊహించని రీతిలో భక్తుల రద్దీ పెరగడంతో కొరత ఏర్పడిందని వెల్లడించారు. సోమవారం నాటికి నిల్వల కేవలం 14,000 టిన్నులకు పరిమితమయ్యాయని పేర్కొన్నారు.


ప్రసాదం తయారీ కేంద్రంలో ఆధునికీకరణ పనులు జరుగుతున్నందున ఈ సమస్య తలెత్తిందన్న బోర్డు వాదనను మంత్రి మురళీధరన్ తప్పుపట్టారు. ముందస్తు సమాచారం, సరైన ప్రణాళిక లేకుండా ఇలాంటి కీలక పనులు ఎలా చేపడతారని ఆయన నిలదీశారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఒక ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేసే విషయంపై ముఖ్యమంత్రి వి.డి. సతీశన్‌తో చర్చిస్తానని మంత్రి స్పష్టం చేశారు.

'సర్' ప్రక్రియ పేరుతో వికృత చేష్టలకు పాల్పడుతున్నారు

ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రక్షాళన (సర్) పేరుతో చేపడుతున్న వింత, వికృత చర్యలు ప్రజల ప్రాథమిక ఓటు హక్కును కాపాడేలా లేవని, విజ్ఞతలేని తీరుతో ఓటర్లను తీవ్రంగా అవమానించేలా ఉన్నాయని సీపీఐ సీనియర్ నేత నారాయణ ఘాటుగా విమర్శించారు. సర్ ప్రక్రియ పేరుతో ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న వైఖరి 'ఎద్దు ఈనిందంటే దూడను గాట్లో కట్టేయమన్నట్లుగా' ఉందని ఎద్దేవా చేశారు. ఓటర్ల వివరాల్లో ఏవైనా సాంకేతిక లోపాలు, తప్పులు ఉంటే వాటిని క్షేత్రస్థాయిలో సరిదిద్దాలే తప్ప, దేశ మాజీ ఉపప్రధాని ఎల్.కె. అద్వానీ, ప్రస్తుత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వంటి అత్యున్నత ప్రముఖులకు కూడా నోటీసులు జారీ చేయడం ఏ రకమైన ప్రక్షాళన అని ఆయన నిలదీశారు. పేర్లలో చిన్నపాటి స్పెల్లింగ్ పొరపాట్లు, వివాహానంతరం మహిళల ఇంటిపేర్లు మారడం వంటి అత్యంత సహజమైన అంశాలను కూడా పెద్ద సమస్యలుగా చిత్రీకరించడం, తాతముత్తాతల పుట్టిన తేదీలను వెతకాలంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం విడ్డూరంగా ఉందని నారాయణ మండిపడ్డారు. దేశంలో ఉన్న కోట్లాది మంది ఓటర్ల హక్కుల పరిరక్షణ విషయంలో ఎన్నికల సంఘం అత్యంత పారదర్శకంగా, రాజ్యాంగబద్ధమైన నిష్పక్షపాతంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రధాని కార్యాలయం నడిపించే ఒక 'సురభి నాటకం'లో స్వయంప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్ అపవిత్రమైన పావుగా మారకూడదని తీవ్ర స్థాయిలో విమర్శించారు.

లీసర్వే పనిష్మెంట్.... రిజల్ట్ లేదని నాగప్ప సస్పెన్షన్.

గౌను వారి పల్లి వీఆర్వో నాగప్ప ను సస్పెండ్ చేసిన కలెక్టర్.



గోరంట్ల సెప్టెంబర్ 21 సీమ వార్త సాయంత్రం. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించాడంటూ గౌను వారి పల్లి వీఆర్వో నాగప్పను కలెక్టర్ సస్పెండ్ చేసిన సంఘటన చోటుచేసుకుంది. వీఆర్వో నాగప్ప గత రెండు సంవత్సరాలుగా గనువారిపల్లి పంచాయతీలో విధులు నిర్వహిస్తూ వస్తున్నాడు.ఈ నేపథ్యంలో ఇటీవల నిర్వహించిన భూ రీ సర్వే లో ప్రోగ్రెస్ చూపించడంలో నిర్లక్ష్యం వహించడం రైతులకు ఇబ్బందిగా మారడం వంటి విషయాలపై కలెక్టర్ సీరియస్ అయి సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గౌనివారిపల్లి వీఆర్వోగా లక్ష్మీనరమ్మ ను నియమించినట్లు అధికారులు తెలిపారు.

దానం నాగేందర్ పిటిషన్ ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను పదవి నుంచి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన సంచలన తీర్పుపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో విచారణ ప్రక్రియ ప్రారంభమైంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు స్వీకరించడానికి సుప్రీంకోర్టు సమ్మతించింది.

సీమ వార్త సాయంకాలం
సోమవారం 21 సెప్టెంబర్ 2026

కూతురి జన్మదిన కానుకగా...

అనాథ ఆశ్రమానికి సరుకులు.

మానవత్వం చాటుకున్న వందేమాతరం టీం సభ్యులు.



అమడగూరు సెప్టెంబర్ 21 సీమ వార్త సాయంత్రం. శ్రీ మాతృశ్రీ వృద్ధాశ్రమానికి పుట్టినరోజు సందర్భంగా నిత్యావసర సరుకులు పంపిణీ. శ్రీ సత్యసాయి జిల్లా అమడుకూరు మండలం గాజులపల్లి గ్రామం కూడలిలో ఉన్నటువంటి శ్రీ మాతృశ్రీ వృద్ధాశ్రమం నందు, వందేమాతరం టీమ్ సభ్యుడు ,నిరంతరం అనేక సేవ కార్యక్రమాలు చేస్తున్న శ్రీ సత్య సాయి జిల్లా తనకల్లు మండలం నాయునిచెరుపల్లి గ్రామ వాస్తవ్యులు కొండ్ల రమేష్ పుత్రిక కుమారి కృతిక జన్మదినం సందర్భంగా అమడగూరు మండలం అమడగూరు లో ఉన్నా మాతృశ్రీ వృద్ధాశ్రమం కు ఒక నెలకు సరిపడా సరుకుకు అందచేయడం జరిగింది... అదేవిధంగా కృతిక ఇలాంటి పుట్టినరోజు కార్యక్రమాలు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, ఇలాంటి మంచి కార్యక్రమాలు మరెన్నో చేయాలని వందేమాతరం టీం సభ్యులందరినీ కోరుకుంటూ కృతిక నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని ఆశ్రమం నిర్వాహకురాలు అరుణ జ్యోతి వృద్ధుల తరఫున ఆశ్రమం తరఫున తెలియజేశారు.

వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోసం

సహాయ నిరాకరణ సమ్మె



అమరాపురం సెప్టెంబర్ 21 సీమవార్త సాయంత్రం మండల కేంద్రమైన అమరాపురంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు వీఆర్ఏలు ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆదేశాల మేరకు మండల వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో సోమవారం వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోసం సహాయ నిరాకరణ ఉద్యమ పోరాటంలో భాగంగా సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వీఆర్ఏల సంఘం సభ్యులు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యంగా వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, అర్హులైన వీఆర్ఏలను పదోన్నతిపై వీఆర్వోలుగా మరియు గ్రేడ్ వాచ్మెన్ గా అటెండర్లుగా నియమించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా నామినీగా విధులు నిర్వహిస్తున్న వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలని మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు హేమావతి ఈరన్న, ఉపాధ్యక్షుడు దార మాదప్ప, కార్యదర్శి రామచంద్రప్ప, కోశాధికారి హనుమంతరాయ, కార్యవర్గ సభ్యులు కరియన్న, చంద్ర, రమేష్ తదితరులు పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి వీఆర్ఏల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని లేనిచో రాష్ట్ర వీఆర్ఏల సంఘం ఆదేశాల మేరకు సమ్మెను ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు

సైన్స్ సెమినార్ పోటీలలో రాష్ట్ర స్థాయికి.....

గోరంట్ల విద్యార్థిని బిందుశ్రీ

గోరంట్ల సెప్టెంబర్ 21 సీమ వార్త సాయంత్రం. శనివారం బీడుపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ పోటీలలో జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాల, గోరంట్లలో చదువుచున్న తొమ్మిదవ తరగతి విద్యార్థిని బిందుశ్రీ రెండవ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎన్నిక అయిందని ప్రధానో పాధ్యాయులు కవిత తెలిపారు. ఎనర్జీ బాస్కెట్ 2047 : ప్రాస్పెక్టస్ అండ్ ఛాలెంజస్ అనే అంశం మీద 6 నిమిషాలు అనర్గళంగా మాట్లాడడమే కాకుండా న్యాయ నిర్ణతలు అడిగిన ప్రశ్నలకు విశదముగా జవాబులు ఇచ్చినందుకు రాష్ట్ర స్థాయికి ఎన్నిక కాబడిందని గైడ్ టీచర్ అనసూయ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నలబై మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. రాష్ట్ర సైన్స్ సెమినార్ పోటీలు 24 ఉ 25 వ తేదీలలో విజయవాడ లో జరుగుతాయని జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిందుశ్రీ ఉ గైడ్ టీచర్ అనసూయమ్మ ను జిల్లా విద్యా శాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు పేరంట్స్ ఈ సందర్భంగా అభినందించారు.



ఆలదపల్లిలో గ్రామదేవతల ఊరేగింపు

అమరాపురం సెప్టెంబర్ 21 సీమవార్త సాయంత్రం మండల పరిధిలోని ఆలదపల్లి గ్రామం నందు సోమవారం గ్రామంలో గ్రామదేవతలైన వీరఅజ్జన్న స్వామి, కరియమ్మ దేవతామూర్తుల ఉత్సవ మూర్తులను గ్రామ ప్రజలు ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో నాగదేవతల పండుగ సందర్భంగా గ్రామ సమీపంలోని భావి వద్దకు స్వామివారి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లి విశేష పూజలు అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని ప్రత్యేక పూజలను దేవత మూర్తులకు నిర్వహించారు



శిథిలావస్థలో ఉన్న అభయ

ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆదుకోండి

సీఎస్ఆర్ నిధులతో నూతన ఆలయ నిర్మాణం చేపట్టాలి

కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన ఆలయ కమిటీ సభ్యుడు ధర్మయ్య



పుట్టపర్తి, సెప్టెంబర్ 21 (సీమవార్త సాయంకాలం బ్యూరో) : భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్న అతి పురాతన ఆలయాన్ని ఆదుకోవాలని ఆలయ కమిటీ సభ్యుడు కాలవపల్లి ధర్మయ్య జిల్లా కలెక్టర్ ను కోరారు. శ్రీ సత్యసాయి జిల్లా నంబులపూలకుంట మండల కేంద్రంలోని శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయం అతి పురాతనమైనదని, ప్రస్తుతం శిథిలావస్థకు చేరిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం పుట్టపర్తి రైల్వే స్టేషన్ పక్కన ఉన్న రెవెన్యూ భవన్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మయ్య మాట్లాడుతూ "ఎన్.పి.కుంట మండల వ్యాప్తంగా ప్రతి శనివారం వందలాది మంది భక్తులు స్వామివారి దర్శనం కోసం వస్తుంటారు. ఇది భక్తులకు ఎంతో ప్రీతిపాత్రమైన ఆలయం. అలాంటి పురాతన దేవాలయం నేడు శిథిలావస్థలో ఉండటం బాధాకరం" అని తెలిపారు. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని సీఎస్ఆర్ నిధులు మంజూరు చేసి నూతన ఆలయ నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ ను కోరినట్లు పేర్కొన్నారు.

కొల్లారప్ప కుటుంబాన్ని

పరామర్శించిన మెట్టు గోవిందరెడ్డి





డి.హీరేహాల్, సెప్టెంబర్ 21 సీమవార్త సాయంత్రం : మండల కేంద్రానికి చెందిన చుక్కాడి కొల్లారప్ప కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాయదుర్గం నియోజకవర్గ వైస్సార్సీపీ పార్టీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పార్టీ కార్యకర్తలతో కలిసి కొల్లారప్ప నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం కొల్లారప్ప కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కొల్లారప్ప మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా వై ఎస్ ఆర్ సి పి నాయకులు తోండె వెంకటేష్, రహమతుల్లా, సింగాడి మంజు, కన్వీనర్ రవీంద్రా రెడ్డి ,నాగలాపురం అంజి తదితరులు మెట్టు గోవిందరెడ్డితో కలిసి కొల్లారప్ప కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని తెలిపారు.

బొమ్మనహళ్‌లో...

6 వ రోజుకు చేరిన వీఆర్ఏల నిరవధిక సమ్మె



బొమ్మనహల్ సెప్టెంబర్ 21 సీమ వార్త సాయంత్రం. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఆర్ఏలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం ఆరవ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా వీఆర్ఏలు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. వీఆర్ఏలను పర్మినెంట్ చేసి పే స్కేల్ అమలు చేయాలని, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించి పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా వంటా-వార్పు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వీఆర్ఏల అధ్యక్షుడు మారుతి, రామకృష్ణ, రవి, అరుణ, మారన్న, మారెప్ప, పోతరాజు, ఆంజనేయులు, వన్నూరు స్వామి, నాగరాజు, నాగేంద్ర తదితర వీఆర్ఏలు పాల్గొన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని వారు తెలిపారు.

నాలుగు నెలల తర్వాత వర్షాలు..

రైతులకు కొంత ఊరట



బొమ్మనహాళ్, సెప్టెంబర్ 21 సీమవార్త సాయంత్రం. గత నాలుగు నెలలుగా వర్షాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు కొంత ఊరటనిచ్చాయి. వర్షాభావ పరిస్థితులతో పంటలు సాగు చేయడంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షాలు లేక పొలాలు బీడుగా మారడంతో రైతులు ఆందోళన చెందారు.అయితే గత రెండు రోజులుగా పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఈ వర్షాలతో భూమిలో తేమ పెరిగి పంటల సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని రైతులు భావిస్తున్నారు. మరికొన్ని రోజులు ఇదే విధంగా వర్షాలు కురిస్తే సాగుకు మరింత ప్రయోజనం చేకూరుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మైక్రోస్కోప్ కోసం రూ.10 వేల విరాళం



గోరంట్ల: సెప్టెంబర్ 21 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు మైక్రోస్కోప్ కొనుగోలు కోసం పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు కేవీ కృష్ణప్ప (రిటైర్డ్ హెచ్ఎం), వారి కుమారుడు కేవీఎస్ ప్రసాద్ (మణి స్వామి) గోరంట్ల వారు రూ.10,000 విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ఈశ్వర్ ప్రసాద్ చేతుల మీదుగా స్వీకరించారు. విద్యార్థుల శాస్త్రీయ అవగాహన, ప్రయోగాత్మక విద్యకు మైక్రోస్కోప్ ఎంతో ఉపయోగపడుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి విరాళం అందించిన కేవీ కృష్ణప్ప, కేవీఎస్ ప్రసాద్‌లకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి. ఈశ్వర్ ప్రసాద్, మోహన్ రెడ్డి, వెంకటేష్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల మండలాన్ని

కరువు మండలంగా ప్రకటించండి.

తాసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన.... సిపిఐ నాయకులు




గోరంట్ల సెప్టెంబర్ 21 సీమ వార్త సాయంత్రం. ప్రస్తుత కరువు పరిస్థితుల నేపథ్యంలో గోరంట్ల మండలాన్ని కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు కిష్టప్ప వెంకటేశు మల్లికార్జున లు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ నాయకులు పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం వద్ద డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తాసిల్దార్ ఉదయ్ కుమార్ కు అందజేశారు. ఇందులో భాగంగా కమ్యూనిస్టు పార్టీ నాయకులు మాట్లాడుతూ గోరంట్ల మండలంలో వర్షాలు లేక పంటలను ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని రైతుల పరిస్థితిని గమనించి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. ప్రధానంగా ప్రస్తుత కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలని, ఇన్పుట్ సబ్సిడీ మరియు పట్టణస్థపరిహారం అందజేయాలని, ప్రతి రైతుకు రెండు లక్షల దాకా రుణమాఫీ చేయాలని, ఉద్యమ పంటలకు తక్షణ సాయం ప్రభుత్వం అందజేయాలని , రైతు పెన్షన్ కింద 50 ఏళ్లు నిండిన ప్రతి రైతుకు నెలకు 10,000 పెన్షన్ ఇవ్వాలని రైతులు ఆత్మహత్యలు చేసుకోకుండా ప్రభుత్వం ఆదుకోవాలని వారి వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

పత్తి పంటను ఉంచాలా? తీసేయాలా?

పత్తి కాపుపై నెలకొన్న నీలినీడలు

క్షేత్ర పరిశీలన చేసి రైతులను ఆదుకోండి - ఏపీ రైతు సంఘం డిమాండ్



తాడిపత్రి, సెప్టెంబర్ 21 సీమ వార్త సాయంత్రం: తాడిపత్రి ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాలతో రైతాంగానికి తాత్కాలిక ఉపశమనం లభించింది. ఎండిపోయే దశకు చేరిన పంటలు వర్షాలతో పచ్చబడ్డాయి. కానీ, పంట ఎదుగుదలకు కీలకమైన దశలో తేమ లేకపోవడంతో ఆశించిన ఎదుగుదల లేకపోవడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం చేన్లు పచ్చగా కనిపిస్తున్నప్పటికీ దిగుబడిపై రైతుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ప్రధాన పంట అయిన పత్తి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పత్తి పంటను అలాగే ఉంచాలా లేక తొలగించి ప్రత్యామ్నాయ పంట వైపు వెళ్లాలా అనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు. ఈ విషయంపై ఏపీ రైతు సంఘం నాయకులు స్పందిస్తూ, వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పత్తి పంట పరిస్థితిని పరిశీలించాలని, రైతులకు స్పష్టమైన సూచనలు, మార్గదర్శకాలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881